## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి రూరల్, జూలై 20 : కామారెడ్డిలోని క్యాంప్ కార్యాలయంలో పలువురికి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం అందజేశారు. నేరుగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అన్ని పత్రాలు అందజేస్తే సీఎం సహాయ నిధి నుంచి డబ్బులు వచ్చేలా ప్రయత్నం చేస్తామన్నారు. ఇకపై మండలాల వారీగా సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తామని చెప్పారు.

### టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

బాన్సువాడ, జూలై 20 : బాన్సువాడలోని మున్సిపల్ కా ర్యాలయంలో టీఎన్జీవోస్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు వెంకట్ శనివారం సభ్యత్వ నమోదు చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులకు సభ్యత్వ నమోదు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్, కోశాధికారి తుల శ్రీనివాస్, మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ

బాన్సువాడ, జూలై 20 : బాన్సువాడ డివిజన్‌లో ఖాళీగా ఉన్న 28 రేషన్ దుకాణాల కోసం అధికారులు భర్తీ చేసేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. మూడు రోజులుగా 62 మంది దరఖాస్తు చేసుకున్నట్లు ఆర్డీవో రాథోడ్ రమేశ్ తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

## ఏడు నెలల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేశాం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**



భిక్కనూరు రైతు వేదికలో మొక్కను నాటి నీరు పోస్తున్న మంత్రి జూపల్లి కృష్ణరావు, షబ్బీర్ అలీ

భిక్కనూరు, జూలై 20: అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేశామని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు రుణ మాఫీ సంబురాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకున్నా సీఎం రేవంత్ రెడ్డి సకాలంలో రూ. 2లక్షలలోపు రైతు రుణమాఫీ చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు ఎక్కువ సమయం కేటాయించాలని, ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. కామారెడ్డి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా చేపట్టినలో ప్యాకేజీల పెండింగ్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ రూ.2లక్షల రుణమాఫీ జరుగుతుందని, ఎవరికైనా ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలో మొదటి విడుతగా 49,541 మంది రైతులకు రూ.235 కోట్ల 61 లక్షల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. అనంతరం రైతువేదికలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ, జిల్లా అటవీ శాఖ అధికారి నిఖిత, ఆర్డీవో రంగనాథ చారి, డీఏవో భాగ్యలక్ష్మి, ఏవో రాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ సంబురాలు



దోమకొండ రైతు వేదికలో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ

దోమకొండ, జూలై 20 : మండల కేంద్రంలో రైతు రుణమాఫీ సంబురాలను శనివారం నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ముందుగా పంచాయతీ సమీపంలో ఉన్న ఇందిరా గాంధీ, మహాత్మగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి, బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, నర్సారెడ్డి, శ్రీకాంత్, నాగరాజ్ రెడ్డి, స్వామి, నర్సయ్య, రామస్వామిగౌడ్, రైతులు పాల్గొన్నారు.

### నేడు బోనాల పండుగ

దోమకొండ, జూలై 20: మండల కేంద్రంలోని చాముండేశ్వరీ ఆలయం బోనాల పండుగ సందర్భంగా ముస్తాబైంది. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యు లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, గౌరవ అతిథులుగా ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్ విచ్చేయనున్నట్లు తెలిపారు. సోమవారం వార సంత (జాతర) అమ్మవారి చీరల వేలం ఉంటుదని సభ్యులు తెలిపారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పట్టణంలో పారిశుద్ధ్య కార్మికులతో చెత్తను తీసివేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరావు

బాన్సువాడ టౌన్, జూలై 20 : పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరావు అన్నారు. పట్టణంలో శనివారం పర్యటించారు. పట్టణంలోని రోడ్ల పక్కన, మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తను మున్సిపల్ కమిషనర్ పారిశుద్ధ్య కార్మికులతో తీసివేయించారు. ఇనుప స్తంభాల వద్దకు వెళ్లొద్దని, మురికి కాలువల్లో చెత్తను వేయొద్దని పట్టణ ప్రజలకు సూచించారు. మురికి నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అధికారి సతీశ్, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**బీబీపేట్ మండలం కోనాపూర్‌లో..**

బీబీపేట్, జూలై 20 : బీబీపేట్ మండలం కోనాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి భరత్ కార్మికులతో పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామంలో ప్రతిరోజూ పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నామన్నారు. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల కోసం సమయాన్ని కేటాయించాలి



తలమడ్లలో విద్యార్థులకు క్రీడా దుస్తువులను అందజేస్తున్న డీఈవో రాజు



పెద్ద కొడప్‌గల్ మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

రాజంపేట్, జూలై 20 : విద్యార్థుల కోసం తల్లిదండ్రులు సమయాన్ని కేటాయించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు అన్నారు. రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ప్రతి మూడో శనివారం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. తల్లిదండ్రుల సూచనలను ఉపాధ్యాయులు తప్పకుండా స్వీకరించాలని చెప్పారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో కూడా ముందుండాలని తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్తుల సహకారంతో సమకూర్చుకున్న క్రీడా దుస్తులను డీఈవో చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు చదివే గదిలో టైం టేబుల్, అవసరమైన చిత్రపటాలను అతికించుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు భిక్షపతి విద్యార్థుల ఇండ్లకు వెళ్లి పరిశీలించడంపై ఉన్నతాధికారులు, తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, ఏఎంవో వేణుగోపాల్ శర్మ, సీఎంవో కృష్ణచైతన్య, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

**పాఠశాల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలి**

పెద్దకొడప్‌గల్, జూలై 20 : పాఠశాల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రులు కీలకపాత్ర పోషించాలని పెద్దకొడప్‌గల్ జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు జి.కమల అన్నారు. పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సహ పాఠ్య కార్యక్రమాలలో ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు తోడుగా ఉండాలన్నారు. 'ఇంటింటా చదువుల పంట' యాప్‌ను ఉపయోగించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు ఎం.రాజమణి మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థుల విషయంలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**హోంవర్క్ చేయించాలి..**

నిజాంసాగర్, జూలై 20: మహ్మద్‌నగర్ మండలంలోని కోమలంచ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ప్రధానోపాధ్యాయులు సురేందర్, బాలచందర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశాల్లో పాఠశాలల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. విద్యార్థులు ఇంటి వద్ద హోంవర్క్ చేసేలా తల్లిదండ్రులు చూడాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేత**

బీబీపేట్, జూలై 20 : మండలంలోని శివార్ రామ్‌రెడ్డిపల్లిలో ఉన్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రవి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐదుగురు జీపీ కార్యదర్శుల బదిలీ

బాన్సువాడ, జూలై 20 : బాన్సువాడ మండలం దేశాయిపేట్, పోచారం, ఇబ్రహీంపేట్ తండా, నాగారం, బుడ్మి గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహించిన ఐదుగురు బదిలీ అయ్యారు. భాస్కర్, శ్రావన్, సచిన్, రవి, రఘు బదిలీ కాగా.. వీరికి బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ రిలీవ్ ఆర్డర్‌ను అందజేశారు. ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీవో సత్యనారయణరెడ్డి, ఏపీవో గంగాధర్ తదితరులు ఉన్నారు.

## ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్ ప్రజావేదిక

రాజంపేట్, జూలై 20 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్ఆర్ఈజీఎస్ సోషల్ ఆడిట్ ప్రజావేదిక శనివారం నిర్వహించినట్లు ఎంపీడీవో రాజేశం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సోషల్ ఆడిట్ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో వామన్ రావు, అంబుడ్స్‌మెన్ శ్రీనివాస్, సోషల్ ఆడిట్ ఏవో ప్రశాంత్, ప్రసాద్, ఎంపీవో రఘురాం, ఏపీవో సక్కుబాయి, టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ బుడ్డీని తొలగించండి



జంగంపల్లిలో ఇంటిని ఆనుకొని ఉన్న విద్యుత్ బుడ్డీ

భిక్కనూరు, జూలై 20: భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామంలోని ఒకటో వార్డులో ఉన్న వడ్ల ధర్మపురి ఇంటి పక్కనే విద్యుత్ బుడ్డీని ఏర్పాటు చేశారు. దీంతో గోడలు, ఇంట్లోకి కరెంట్ షాక్ వస్తుందని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇంటి ముందు నుంచి రాకపోకలు సాగించేవారికి ప్రమాదం పొంచి ఉందని, ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ బుడ్డీని ఇక్కడి నుంచి తొలగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## సీసీ కెమెరాలతో నేరస్తులను గుర్తించవచ్చు



మాట్లాడుతున్న సదాశివనగర్ సీఐ సంతోష్

గాంధారి, జూలై 20: గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరస్తులను సులభంగా గుర్తించవచ్చని సదాశివ నగర్ సీఐ సంతోష్ అన్నారు. గాంధారిలో శనివారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతపై వర్తక వాణిజ్య సంఘాలు, గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుకు దుకాణాదారులతోపాటు గ్రామస్తులు సహకరించాలని కోరారు. సీసీ కెమెరాలు ఉంటే నేరం జరిగితే నిందితులను గుర్తించవచ్చన్నారు. కార్యక్రమంలో గాంధారి ఎస్సై ఆంజనేయులు, దుకాణాల యజమానులు, ఆయా పార్టీల నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### మహిళకు పాముకాటు

లింగంపేట, జూలై 20: మండలంలోని లింగంపల్లి తండాకు చెందిన గిరిజన మహిళ జీరీకి పాముకాటు వేసింది. దీంతో సకాలంలో స్పందించిన 108 సిబ్బంది ఆమె ప్రాణాలను కాపాడారు. జీరీకి శనివారం ఉదయం పాముకాటు వేయగా కుటుంబీకులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వెంటనే తండాకు చేరుకొని బాధితురాలికి చికిత్సలు నిర్వహించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బంది సత్యం, పైలట్ మోహన్‌కు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

## తెలంగాణ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అనిల్ కుమార్



ఎల్లారెడ్డి రూరల్, జూలై 20: తెలంగాణ ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎల్లారెడ్డికి చెంది న అనిల్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం సాయంత్రం జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన గూగుల్‌మీట్‌లో ఎల్లారెడ్డి మండ ల పరిషత్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

### ఎల్లారెడ్డిలో ముసురు

ఎల్లారెడ్డి, జూలై 20: ఎల్లారెడ్డి మండలంలో శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తున్నది. దీంతో శనివారం పట్టణమంతా నిర్మానుష్యంగా మారింది. చల్లటి గాలులతోపాటు ముసురు వేయడంతో చిరు వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు చిరుజల్లులు ఊరటనిచ్చాయి.



మట్టిని తొలగిస్తున్న పొక్లెయిన్



పనులను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

## పంట కాలువను శుభ్రం చేయించిన అధికారులు

లింగంపేట, జూలై 20: మండల కేంద్రంలోని సహకార సంఘం షాపింగ్ కాంప్లెక్స్ పక్కన నీటి పారుదల శాఖ కాలువను పంచాయతీ అధికారులు శనివారం శుభ్రం చేయించారు. ఈ నెల 18వ తేదీన నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన 'గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం' కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు కాలువను బాగు చేయించారు. పంట కాలువలో మట్టి పూడుకుపోవడంతో చెత్తా చెదారంతో నిండింది. కల్వర్టులో పూడుకు పోయిన మట్టిని తొలగించడానికి జేసీబీ సహాయంతో కల్వర్టుపై ఉన్న రాళ్లను తొలగించారు. పంట కాలువపై చేపట్టిన నిర్మాణాన్ని కూడా తొలగించారు. పూడిక తీత పనులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు పర్యవేక్షించారు. కాలువను శుభ్రం చేయించిన అనంతరం దోమల నివారణకు మందు స్ప్రే చేయించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ తెలిపారు.

## డెంగీ బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న డీపీవో

లింగంపేట, జూలై 20: మండల కేంద్రానికి చెందిన పలువురు డెంగీ బాధితులను జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు శనివారం పరామర్శించారు. బాధితల ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని సూచించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

## నేడు ఎల్లారెడ్డిలో గురుపౌర్ణమి వేడుకలు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 20: ఎల్లారెడ్డిలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6గంటలకు కాకడహారతి, సాయిబాబా విగ్రహానికి మంగళ స్నానం, సామూహిక సత్యనారాయణ వ్రతాలు, మధ్యాహ్నం మహానైవేద్యం, హారతి, ప్రసాద వితరణ, అన్నదానం, సాయంత్రం రథయాత్ర, బాబా పాదుకలకు పల్లకీసేవ, ధూప హారతి, ప్రత్యేక భజనలు తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నాగిరెడ్డిపేట, జూలై20: మండలంలో కొత్తగా పట్టాపాస్‌బుక్కులు పొందిన రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు బీమా కోసం 2024 సంవత్సరంలో జూన్28 వరకు ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న రైతులు, ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు పొందిన వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్, దరఖాస్తు నింపిన ఫారమ్‌తో రైతు స్వయంగా వెళ్లి ఏఈవోలకు అందించాలన్నారు. ఆగస్టు ఐదో తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గతంలో నమోదైన రైతులు సవరణలు ఉంటే దరఖాస్తు చేసుకునే వీలు ఉన్నదని తెలిపారు. పూర్తి వివరాల కోసం స్థానిక ఏఈవోలను సంప్రదించాలని సూచించారు.

## ప్లే స్కూల్స్‌గా అంగన్‌వాడీ కేంద్రాలు



ఎల్లారెడ్డిలో 'అమ్మమాట – అంగన్‌వాడీ బాట' నిర్వహిస్తున్న టీచర్లు

లింగంపేట, జూలై 20: అంగన్‌వాడీ కేంద్రాలు ప్లే స్కూల్స్‌గా మారినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆరతి తెలిపారు. మండలంలోని ముస్తాపూర్ గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం 'అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట' నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. చిన్నారులను అంగన్‌వాడీ కార్యకర్తలు అమ్మలా చూసుకుంటారని అని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటాపాటలతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాబూరావు, అంగన్‌వాడీ టీచర్ అంజలి, ఆశ కార్యకర్త స్వరూపతోపాటు చిన్నారులు, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

***చిన్నారులను అంగన్‌వాడీలకు పంపాలి..***

ఎల్లారెడ్డి రూరల్, జూలై 20: చిన్నారులకు ప్రీస్కూల్ వాతావరణం అలవాటు కావడానికి ప్రైవేట్ పాఠశాలల కన్నా అంగన్‌వాడీ సెంటర్‌కు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూప అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని రెండో అంగన్‌వాడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన 'అమ్మ మాట – అంగన్‌వాడీ బాట' కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రెండున్నరేండ్ల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ సెంటర్‌కు పంపితే వారికి మంచి విద్యాబుద్ధులు వచ్చే విధంగా తయారు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో 1,2వ అంగన్‌వాడీ సెంటర్ల టీచర్లు నీలారాణి, సావిత్రి, పిల్లలు, తల్లులు పాల్గొన్నారు.

## కాలభైరవుడిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



జడ్జికి స్వామి చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఆలయ ఈవో

రామారెడ్డి, జూలై 20: మండలంలో కొలువైన కాలభైరవ స్వామిని హైకోర్టు జడ్జి జె.శ్రీనివాస రావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు శ్రీనివాస్‌శర్మ, వంశీశర్మ కలిసి హైకోర్టు జడ్జికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ ఈవో ప్రభు రాంచంద్రం జడ్జిని సత్కరించి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. ఆయనవెంట కామారెడ్డి జిల్లా జడ్జి వీఆర్ఆర్ ప్రసాద్, కామారెడ్డి ఆర్డీవో జగన్నాథరావు, రామారెడ్డి తహసీల్దార్ లక్ష్మణ్, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, సీఐ రామన్, రామారెడ్డి, మాచారెడ్డి ఎస్సైలు విజయ్‌కొండ, కట్ట అనిల్ ఉన్నారు.

## కొనసాగుతున్న వన మహోత్సవం

గాంధారి, జూలై 20: వానలు కురుస్తుండడంతో జిల్లావ్యాప్తంగా వన మహోత్సవం ఊపందుకున్నది. గాంధారిలోని ఎల్లమ్మ ఆలయ పరిసరాల్లో ఎక్సైజ్ అధికారులతో కలిసి గౌడ కులస్తులు శనివారం ఈత మొక్కలను నాటారు. ఎల్లారెడ్డి ఎక్సైజ్ సీఐ షాకీర్ అహ్మద్ మాట్లాడుతూ.. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై గంగాధర్, సిబ్బంది రవీందర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, రంజిత్‌రెడ్డి, స్రవంతి, రజిత, భూపాల్, గౌడ సంఘం అధ్యక్షుడు నారాగౌడ్, ఎల్లమ్మ ఆలయ కమిటీ అధ్యక్షుడు అంజాగౌడ్, సాయాగౌడ్, రవి గౌడ్, బాలరాజ్‌గౌడ్, దత్తాద్రిగౌడ్, వెంకాగౌడ్, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తి అదృశ్యం



సాయిలు

బిచ్కుంద, జూలై 20: బాన్సువాడకు చెందిన సాయిలు అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడకు చెందిన గాండ్ల సాయిలు బిచ్కుంద మండలంలోని ఖత్‌గావ్‌లో ఉంటున్న తన చెల్లెలు వద్దకు ఈనెల 5వ తేదీన వచ్చాడు. అక్కడే ఉంటున్న అతడు 10వ తేదీన బయటికి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి బయల్దేరాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి తల్లి అంజవ్వ బిచ్కుంద పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## రక్తదాతకు సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, జూలై 20: అత్యధికంగా రక్తదానం చేసిన ఎల్లారెడ్డివాసి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్స వెంకటరమణను హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర రాజధానిలో ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వెంకటరమణను ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ సత్కరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముటా గోపాల్, ఆర్యవైశ్య ఫెడరేషన్ నాయకుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రక్తదాతల సమన్వయ కర్త డాక్టర్ బాలు తదితరులు పాల్గొన్నారు.

**బదిలీపై వెళ్తున్న ఉద్యోగికి..**

మాచారెడ్డి, జూలై 20 : మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహించిన అర్జున్ అనే ఉద్యోగి బీబీపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గోపీబాబు శనివారం అర్జున్‌కు శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో సూపరిండెంటెంట్ ప్రమోద్, సిబ్బంది ఉన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**పాస్‌పోర్ట్ పోయినది**

★ PUPPALA MADHUSUDHAN S/o MALLAIAH R/O. H.NO: 1-33, Vill: Ravutla, Mdl : Sirikonda, Dist: Nizamabad. నా యొక్క పాస్ పోర్ట్ నెం: N642110 గలది రావుట్ల నుండి సిరికొండ బస్‌స్టేషన్‌కు బైక్‌పై వెళ్ళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించగలరు. సెల్ : 99120 34560.
NTZ-340188

**PLOT FOR SALE**

★ మీ పిల్లల బంగారు భవిష్యత్తు కొరకు... 1 లక్షకే 121 చ.గజాల ప్లాట్, 20 మొక్కలతో, ఎర్రచందనం, మహాగని. ఫ్రీ మెయింటెనెన్స్, 10 సం॥లలో లక్షల ఆదాయం. Cont: 8500664291.
NT-325890

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**ప్లాట్స్ అమ్మబడును**

★ నిజామాబాద్ మారుతినగర్ వెనుక, న్యూ హౌసింగ్ బోర్డ్ ఎదురుగా, లే అవుట్ ఈస్ట్ ఫేస్ 312 గజాలు మరియు వెస్ట్ ఫేస్ 306 గజాల గల 2 ప్లాట్లు అమ్మబడును. సెల్: 94937 11066
NTZ-340178

**OLD AGE HOME**

★ ఒమేగా హోంకేర్: వంట, ఇంటిపని, వృద్ధులకు, పేషెంట్లను, చిన్నపిల్లలను 24 గం॥ చూసుకొనుటకు మీ ఇంటివద్దకే Sr. కేర్‌టేకర్స్‌ని పంపబడును, హైదరాబాద్. 8977639664, 8977639665.
NT-325766-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.